5-15-01-87-01

# ప్రబోధ 3

ఒకనాడు యోగంబు ఒకనాడు రోగంబు
అనుభవించెడు వారినరయుచుంటి
ఒకనాడు త్యాగంబు ఒకనాడు భోగంబు
అనుభవించెడి వారినరయుచుంటి
ఒకనాడు సంపత్తు ఒకయేడు దారిద్ర్యము
అనుభవించెడి వారినరయుచుంటి
ఒకనాడు దుఃఖంబు వేరొకనాడు సుఖంబు
అనుభవించెడి వారినరయుచుంటి
ఇందు సుస్థిరమైన దియెద్ది లేదు
స్థిరముకానట్టి దానికి మురిసిపోక
సత్యనిత్యము జ్ఞానంబు అనంతమైన
ఆత్మతత్వమెరుంగుడో ఆర్యులార!
భుక్తి విద్యలెన్ని భక్తితో చదివేరు
ముక్తి విద్యనెవడు ముందురాడు
ఇట్టివాడు దైవమెరుగంగ నేర్చునా
ఎట్టి విద్యలుండి యేమి ఫలము.

దివ్యాత్మస్వరూపులారా!

మాతృదేశ వృజ్ఞుల భవిష్యత్తుకు నేటి బాలబాలికలే ఆశాకిరణాములు. వారే రేపటి పౌరులు. నిత్యజీవితములో నైతిక ఆదర్శవంతమైన జీవితముగా మల్చుకోటానికి విద్యార్థి, విద్యార్థినులు కృషిచెయ్యాలి. యీనైతిక ఆదర్శములకే విద్యార్థులు జీవించాలి. జీవితములో యెట్టి బాధలకైనా యెదుర్కొని దానియందు పరిపూర్ణస్వేచ్ఛను సంపాదించుకోవాలి. స్వేచ్ఛ అనగా కేవలము మృగముల వలె, పక్షులవలే యిష్టానుసారము సంచరించటము కాదు. ఆత్మగౌరవము, ఆత్మనిగ్రహము, ఆత్మజ్ఞానము, ఆత్మానందముతో జీవించటమే పరిపూర్ణమైనటువంటి స్వేచ్ఛకు సరైన అర్థము. ఇట్టి పవిత్రమైనటువంటి స్వేచ్ఛను సంపాదించుకున్నప్పుడే మానవుడు యీజగత్తునందు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించగలడు.

మానవదేహము ఒక విచిత్రమైనటువంటి, అపూర్వమైనటువంటి ఒక యంత్రము. ఈ దేహము ఒక చిన్న ప్రపంచము. ఇలాంటి ప్రపంచస్వరూపమైన పవిత్ర దేహము ధరించి మానవుడు ప్రపంచమునకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించలేకపోవటము ఒక విచారకరమైనటువంటి విషయము. దేహమనగా లేక మానవుడనగా కన్నులు ముక్కులు చెవులు నోరు చేతులు కడుపు కాళ్ళు అన్నింటి యొక్క కలయిక స్వరూపమే. ఏ ఒక్క అంగము ప్రత్యేకించిన టువంటి ఒకస్వరూపము మానవత్వము

కానేరదు. కనుకనే యీ మానవత్వము యొక్క దివ్యత్వాన్ని అర్థము చేసుకొని వర్తించటానికి దేహము యొక్క అభివృద్ధిని మనము అత్యవసరముగా కోరాలి; ఆచరించాలి.

విద్యార్థులకు వినయము, సత్యము, అహింస, అస్తేయము, బ్రహ్మచర్యము యీ ఐదు విద్యార్థుల యొక్క ప్రాణస్వరూపములు. ఈ పంచప్రాణస్వరూపమైనటువంటి విద్యార్థి యిందులో యే ప్రాణము సక్రమమైన మార్గములో అనుభవించుచుండిన తాను నిర్మలమైన జీవితాన్ని అనుభవించటానికి ఒక ఆదర్శము. కేవలము విద్యార్థి, విద్యార్థినులకు బ్రహ్మచర్యము అనేటువంటి పవిత్రమైన మార్గము యీ వయసునకు అత్యవసరము. ఇది కేవలము నైతిక ఆదర్శముపై ఆధారపడి వుంటుంటాది. మానవుని యొక్క జీవిత విజయములన్నియు తన యొక్క నడతపైననే ఆధారపడి వుంటుంది. తన నడతను సక్రమమైన రీతిగా తీర్చి దిద్దుకోవాలి. భౌతికంగా లౌకికంగా ధార్మికంగా ఆధ్యాత్మికమైనటువంటి జీవితాలను నైతిక జీవితమే వెన్నెముక. కేవలము బ్రహ్మచర్యమనగా గృహస్థ ధర్మము లేకుండా వుండటం కాదు. నిరంతరము బ్రహ్మతత్త్వములో తన మనసు తత్త్వము చరింపచేయటము.

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.

అదియు పూర్ణము. యిదియు పూర్ణము. పూర్ణమున పూర్ణము ఉదయించు. పూర్ణమున పూర్ణమును తీసిన పూర్ణమే శేషించియుండును. అనగా పరమాత్ముడు ప్రకృతి పూర్ణస్వరూపులు. కనుకనే మనము చేయు ప్రతి పని కూడను పూర్ణాకారము ధరించినప్పుడే, పూర్ణతత్వాన్ని వహించినప్పుడే యీ పూర్ణత్వమును, పరిపూర్ణమైన ఆనందమును అనుభవించగలము.

పరిపూర్ణస్వరూపుడైనటువంటి పరతత్వాన్ని మనము పొందవలెనన్న మన సర్వ కర్మలు కూడను పరిపూర్ణమైనటువంటి స్థితిలో వుండాలి. మనము యే చిన్న కార్యమును కూడను పరిపూర్ణ విశ్వాసముతో చేయటం లేదు. పరిపూర్ణ త్యాగముతో మనము ఆచరించటం లేదు. అన్ని క్రియలు కూడను అపరిపూర్ణముగా మనము అనుభవిస్తాము. ఈ అపరిపూర్ణమైనటువంటి యీ క్రియలన్నియు పరిపూర్ణస్వరూపుడైన పరమాత్మను యెట్లా చేరగలవు. ఆరోగ్యమైన దేహమునందే ఆరోగ్యమైన మనసు నిలువగలదు. మనో శరీరములు ఆరోగ్యముగా వుండినప్పుడే సంకల్పములు సక్రమమైనటువంటి సంకల్పములు అభివృద్ధి కాగలవు. కనుక మన భావములు పవిత్రమైనవిగా, నిష్కల్మషమైనటువంటివిగా వుండాలనుకున్నప్పుడు శరీరము పుష్టిగాను, మనసు సంతుష్టిగాను వుండాలి. కనుక యీ పుష్టి తనమునకు సంతుష్టికి మన శరీరము యొక్క పోషణ అత్యవసరము.

నాగరికత దేశమని పేరు పొందిన రోమను దేశములో శరీరమును యింత అభివృద్ధి గావించుకొని, యెంత ఆరోగ్యవంతముగా చూచుకుంటారో అట్టివారిని గొప్పవారని భావింతురు. నిజమైన ఆస్తి మన ఆరోగ్యమే. విద్యార్థి, విద్యార్థినులకు యీనాడు పుష్టియైనటువంటి శరీరము, సంతుష్టియైన భావములు అత్యవసరము. పూర్వపు మహర్షులందరు పవిత్రమైన చర్యల చేత, పవిత్రమైన దివ్యభావముల చేత సత్కీర్తి నార్జించి ప్రభావమును అభివృద్ధి గావించుకున్నారంటే దీనికి మూలకారణము వారి ప్రవర్తనయే.

నియమిత జీవితాన్ని మనము అత్యావసరముగా పాటించాలి. జీవితములో నియమమే లేకపోతే యిది కేవలము అన్నివిధములైనటువంటి అవస్థలకు గురి అవుతుంది. ప్రకృతి అనేకరకములైన నియమములను ఆచరిస్తూ వుంటున్నాది. సూర్యోదయము, సూర్యాస్తమయము పురస్కరించుకొని, ఆహారము చేసుకొని తిరిగి ఋతువులవరకు తమ తమ నియమములను తాము పాటిస్తూ వున్నవి. ప్రకృతియే మనకు సరియైనటువంటి నియమాలను ఆదర్శముగా నిరూపిస్తూ వుండాది. ఇట్టి నియమములను మనము ఆచరించకుండా పోవటంచేతనే అనేక విధములైనటువంటి కష్టములకూ, నష్టములకు గురి అవుతున్నాము.

నిజముగా యీనాటి విద్యార్థులు శ్రేయస్సును యేమాత్రము చింతించక కేవలము ప్రేయస్సును మాత్రమే పరితపిస్తున్నారు. నశ్రేయో నియమం వినా. ఈ నియమము అనేటువంటిది లేకపోవుట చేతనే యితనికి శ్రేయస్సు తగ్గిపోవుచున్నది. ఈనాడు వినోదార్థమై మన యొక్క ఆటపాటలు ప్రారంభమయ్యాయి. కానీ యీ వినోదము క్రమక్రమేణా విషాదమునకు కొనిపోవుచున్నది. పూర్వము రోమ్, స్వీడన్, గ్రీక్ చైనా యిలాంటి ప్రాంతముల లోపల మొట్టమొదట విలాసముల నిమిత్తమై, విహార నిమిత్తమై, వింతల నిమిత్తమై యీ ఆటలు ప్రారంభమై క్రమక్రమేణా అవి విషాదస్థితికి కొనిపోయినవి. కనుకనే వీటికి ఆటలు అనేటువంటి పేరు విరుద్ధమై జూదములు అనేటువంటి పేరుగా నిరూపిస్తూ వచ్చాయి. జూదమనగా నేమి? ధనమును వస్తువులను ఒడ్డి ఆడటంచేత యిది జూదముగా మారిపోతుంది. ఈ ఈజిప్టు, రోమ్, గ్రీస్ లోపల యీ జూదము అనేటువంటిది పాచికలు, పేకాట, గుర్రపుపందెములు యీవిధముగా అవి పేరు పొందాయి. పశ్చిమ ఆఫ్రికా లోపల యీ ఆటలు క్రమక్రమేణా మితిమీరిపోయి యెవరు ఆటలయందు గెలుపొందుదురో వారికి ఓడినటువంటివాడు కుడి చేయి కొట్టియివ్వాలి అని ఒక నియమము చేశారు. క్రమక్రమేణా అది మరింత మితిమీరిపోయి చైనా, పశ్చిమ ఆఫ్రికా యివన్నీ పిల్లలను, భార్యను కూడా ఒడ్డి జూదమాడటం ప్రారంభించారు. చైనా పతనము కావటానికి యీ జూదము తే మూలకారణము. క్రమక్రమేణా పెరిగిపోయి 19వ శతాబ్దములో క్రికెట్టు అనేటువంటి జూదము మితిమీరిపోయింది. ఒక్కొక్క వ్యక్తి యీ క్రికెట్ అనేటువంటి జూదములోపల అరవై మిలియన్సు డాలర్సు ఒడ్డేటువంటివారు. ఒక మిలియన్ అంటే 10 లక్షలు. 60 మిలియన్లు అంటే ఆరుకోట్ల డాలర్లు. ఆరుకోట్ల డాలర్లు అంటే మన భారతదేశములో విలువ అరవై కోట్లు. ఇందులో గుర్రపుపందేలలోపల Foot Ball అనేటువంటి match లు లోపల మరింత యెక్కువగా ధనము వ్యయము చేసేటువంటివారు. మొన్న మొన్న 1947 లోపల ఇంగ్లాండులో Foot ball match లో గ్రౌండు అంతా కూడను డాలర్సు చల్లినారు. ఈ విధముగా వినోదము నిమిత్తమై విదేశస్థులు ధనమును వినియోగించి వినోదనిమిత్తమై యేర్పడినటువంటి ఆటలంతా విషాదకరమైనటువంటి రూపాన్ని ధరింపచేశారు. ఈనాడు ఆటలన్నియు ఒక వ్యాపార రంగముగా తయారైనాయి. ఈనాడు చిన్న చిన్న పిల్లలందరు cricket, badminton Foot ball యిలాంటి ఆటలంతా నేర్చుకోటంలో మేము కూడను గొప్ప ప్లేయర్లుగా తయారైపోయి దండిగ లక్షలు సంపాదించాలి అనేటువంటి లక్ష్యముతో యీ ఆటలలో ప్రవేశిస్తున్నారు. కానీ యీ ఆటలు దేహమును ఆరోగ్యవంతముగాను, మనసును ఆనందవంతముగాను తీర్చిదిద్దుకొనే నిమిత్తమై యేర్పడినటువంటివి. మొట్టమొదట యీ cricket game యెక్కడ ప్రారంభమైంది. ఇది 1877 లోపల ఆస్ట్రేలియా లో మెల్‌బోర్న్

అనే గ్రామములో match ప్రారంభమైంది. ఆనాడు దీనియొక్క ఆశయములు వేరుగా వుండేటువంటివి. ఆనాటి ఆటయందు ఒక శోభరాజిల్లించేటువంటిది. ఆటలక్రమాన్ని మాత్రమే లక్ష్యమునందు వుంచుకొని ఆట ఆడేటువంటి వారు. అదే వారికి నిజమైనటువంటి ఫలము అని భావించెడివారు. అందులో అవుట్ అయినప్పటికిని తాను జయించినటువంటి వాడుగా ఆనందించేవాడు. అనగా క్రమమును అనుసరించటమే విజయము అనేటువంటిది ఆనాటి లక్ష్యము. ఈనాటి లక్ష్యము యెలా వుందంటే యెదుటివాడిని ఓడించటమే లక్ష్యమని పెట్టుకున్నారు. ఈ పద్ధతులు, యీ నియమములు తాను యే విధముగా వుల్లంఘించినప్పటికి ఫరవాలేదు. కొంతమంది యీ వాచ్ చేసేటువంటివారు విజిల్ వూదినా వారు foul చేయటం లేదు. అందులో కూడను ఒక వ్యాపారము ప్రారంభమైంది. ఏదో ఆ విచారణ చేసి వాచ్ చేసేటువంటి వాళ్లకు అంతో యింతో యిస్తే వాళ్లు కూడా సరిపోతున్నారు. ఇది నిజమైనటువంటి game కాదు. ఈ ప్లే చేసేటువంటి వారు కూడను సమయోధులుగా వుంటుండాలి. మహాభారత యుద్ధ సమయములో ధర్మరాజు కౌరవులను కోరాడు. మా ఐదుమందిలో యెవరినైనా సరే మీరు కోరి వాడిని ఓడించారంటే తిరిగి నేను పన్నెండు సంవత్సరములు అరణ్యానికి వెడతానన్నాడు. కానీ కౌరవులు దుష్టులు, దుర్మార్గులు, దుర్బుద్ధులు కలిగినటువంటి వారు అయినప్పటికిని యీయొక్క జూదమునందు గానీ, యింకే విధమైన ఆటలయందు గానీ నియమాన్ని వారు పాటించుకుంటూ సమయోధులు కావాలని విశ్వసించేటువంటివారు. దుర్యోధనునికి ఒక గదయుద్ధము తప్ప అన్యము యే మాత్రము తెలియదు. అతను యే నకులినో, యే అర్జునునో, కోరివుంటే పాండవులు తిరిగి అరణ్యానికి పోవలసి వచ్చివుండేది. కానీ ఆ విధముగా కోరలేదు. తగు సమయోధుడైన భీముని మాత్రమే యుద్ధము చేయమన్నాడు. కనుక యీయొక్క ఆటల పోటీలయందు సమయోధులుగా వుంటుండాలి.

ఈనాడు అధికారులు కూడను యీ విధమైనటువంటి విచారణ సల్పటం లేదు. undergraduate పిల్లల లోపల P.G. పిల్లలతో ఆడిస్తూ వుంటారు. దీనివల్ల ఓడిపోతే యెంత బాధపడతారో అనేటువంటి బాధ కూడను యీ అధికారులకు యే మాత్రము తెలియదు. కనుకనే పిల్లల్లో యీ విధమైనటువంటి నిరాశ నిస్పృహలు అభివృద్ధి అవుతున్నాయి. దీనికి యెవరు కారణము. అధికారులు. అధికారులకు ఆటల సంగతైనా తెలియకుండా వుండాలి లేక ఆటలపైన శ్రద్ధ అయినా లేకుండా వుండాలి. ఈ రెండు కారణాలు తప్పు మరొక మూడవ కారణం యే మాత్రం నమ్మటానికి వలులేదు. ఇలాంటి అధికారులు అభివృద్ధి కావటం చేతనే విద్యార్థుల లోపల విప్లవాలు పెరుగుతూ వస్తున్నాయి. కేవలము యిట్లాంటి విషయములందు ఒక విధమైనటువంటి organise చక్కగా చెయ్యాలి. ప్రొఫెసర్లతో, ఫిజికల్ డైరెక్టర్లతో పిల్లలతో చక్కగా సంప్రదించి యీయొక్క ఆటల పోటీలు యే విధముగా జరగాలి అనేటువంటి ఒక ప్లానును వేసి చక్కగా యీయొక్క campus కు పిలిపించి యీ ఆటలు ఆడించటానికి ప్రయత్నం చెయ్యాలి. ఏ విధమైనటువంటి ప్లానులు వేయకుండా కేవలము inter campus నంతా పిలిపించి వాళ్లతో యీ విధమైనటువంటి ఆటలు ఆడించటమంటే యిది కేవలము హాస్యాస్పదమైనటువంటి విషయము. ఏవ్వరితోనూ సంప్రదించటం లేదు. దీనికి ఒక కమిటీ అనేటువంటిది లేదు. ఒక కమిటీనే లేనప్పుడు యీ physical Instructor ఒకడో యిద్దరో యే రీతిగా తాను చూచుకోగలడు. ముఖ్యముగా దీనిలో శ్రద్ధ తక్కువైంది.

ఒకరిపైన ఒకరికి విశ్వాసము క్షీణించిపోయింది. యిది సరియైనటువంటిదికాదు.

భవిష్యత్తులో అనేకమైనటువంటి బాధలను యెదుర్కోవలసివస్తుంది. అయితే చదువు సంస్కారానికి చాలా భేదము వుంది. చదువు కేవలము గ్రంథపరిచయము కావచ్చును. తెలివితేటలను పెంచవచ్చు. కానీ common sense, General knowledge యివి అభివృద్ధి పరచటానికి వీలులేదు. Education తో పాటు commonsense, General knowledge అత్యవసరము. అప్పుడు యిలాంటి దాన్నంతను సమన్వయము చేసుకొని దానిని సంరక్షించుకోటానికి తగిన కృషి చేయవచ్చును. నిజముగా మన Institute లో చూస్తే అందరు భక్తులే. Vice Chancellor భక్తుడు. Registrar భక్తుడు. Controller భక్తుడు. ఇంక Professors భక్తులు. Treasurer భక్తుడు. విద్యార్థులున్నారు వారు పరమభక్తులు. అందరు భక్తులే కానీ యిలా పంజరగటం యెక్కడ వుంది కారణం. పూర్వము పల్లెలలో అనేటువంటి వారు. బజారంతా బ్రాహ్మణులే కాని మా కోడిపిల్ల కనుపించటంలేదనే వారు. యీ కోడిపెట్టి తినే బ్రాహ్మలు యెవరో యిందులో వుంటున్నారు. లేకపోతే యీ కోడిపిల్ల పోవటానికి యే కారణము లేదు. కనుక యీనాడు మన Institute లోపల యీ విధమైనటువంటి లోపము జరుగుతుందంటే యెక్కడ వుంది కారణం. దీనికి లకాన్ని గుర్తించాలి. unity లేకపోటమే దీనికి మూలకారణము. ఈ unity వుంటే Vice-Chancellor, Registrar, Controller Professors అందరూ చేరి ఒకరితో ఒకరు కలిసి మెలిసి సంప్రదించి కార్యాలు చేస్తే యెంత ఆనందంగా జరిగేటువంటిది. కలయికే లేదు. ఎవరిపని వారిది. బావిలోని కప్పవలె తమ పనులు తాము చేసుకుంటూ వుంటారు. కానీ విశాలమైనటువంటి ప్రపంచము మన Institute పై సహస్రాది నేత్రములతో చూస్తున్నాది అనేటువంటి విచారణ వారు చేయటంలేదు. స్వామి పిల్లల Sports కు రాలేదే చూడటానికి రాలేదే అని మాత్రం విచారించేస్తారు. నేను ఒక్కడే కాదు. నేను వచ్చినా నా ప్రశాంతి నిలయములో వుండినటువంటి అన్ని దేశముల భక్తులు అక్కడ ప్రవేశిస్తారు. కానీ వారందరు మన పిల్లలు ఆడే ఆటలు చూస్తే చాలా హాస్యాస్పదము చేస్తారు. ఏ విధమైనటువంటి మేనేజ్‌మెంటు లేక ఆర్గనైజ్ చేయటం చేత యిలాంటి ఆటలు చూచి మా Institute గౌరవము కూడను పోతుంది. ఆ గౌరవమును కాపాడే నిమిత్తము నేను రాకుండా వుండినాను. కానీ Institute గౌరవం వారికి లేకుండా పోవచ్చును. కానీ నాకు లేకుండా వుంటుందా. ఇది శాశ్వతముగా వుండేటువంటిది. కనుక ఆ గౌరవాన్ని కాపాడుకొనే నిమిత్తము నేను యిక్కడకు రాలేకపోయినాను. వున్నది మూడు కాలేజీలే. మూడు కాలేజీలనే ముచ్చటగా మురిపెము చూడలేకుండాపోతే యింక మున్నూరు వుండినటువంటి కాలేజీలను మీరు యేరీతిగా maintain చెయ్యగలరు. నేను ఆనందముగా వచ్చి దీనిని ప్రారంభోత్సవము చేశాను. ప్రప్రథమములో ఆ ప్రయిమరీ స్కూలు పిల్లలు వచ్చినారు ఆడుతుంటే సిపాయిలు నడుస్తూ వచ్చినట్లు వచ్చేసారు. ఆ దృశ్యము చూచేటప్పటికి యెంతో ఆనందము వేసింది. క్రమక్రమేణా ఆ ఆనందము తరుగుతూ తరుగుతూ పోయింది. కానీ పిల్లలు మాత్రం పెరుగుతూ పెరుగుతూ పోయారు. కట్టకడపటికి మన Institute పిల్లలు వచ్చేసారు. తలను వంచుకోవలసి వచ్చింది. కారణం యేమిటి. వాళ్లకు మార్చింగు కూడా తెలియదు. కేవలము వృద్ధులైనటువంటి వారు నడచినట్లుగా నడుస్తున్నారు. వృద్ధులు వుండినటువంటి వాళ్లలా నడుస్తున్నారు. అలాంటి దృశ్యము నిజముగా మనము చూడవలసినదేనా.

అనంతపురములోపల అందరూ ఆడవారే. వాళ్లు యెంత బాగా ఆర్గనైజు చేశారు. నాకెందరూ సమానులే. కానీ వాళ్లు నిజముగా ఆడవారిలో ఐకమత్యము తక్కువ. అలాంటి స్వభావము కలిగినటువంటి వారైనా కూడను అందరు టీచర్లు కలిసిమెలిసి యీ ఆర్గనైజ్ చేయటంలోపల యెంత బాగా రాణించాయి వాళ్ల దృశ్యములు. ఒక్కొక్కరు ఒక్కొక్క భాగాన్ని తీసుకున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క బాధ్యత వహించారు. వారి ప్రదర్శన మాత్రమే అందరిని ఆశ్చర్య చకితులను గావించింది. అందరి హృదయాలను ఆకర్షించింది. అందరికి ఆనందము ఉప్పొంగిపోయింది. వాళ్లు చేసిన ప్రతి యొక్క విషయములో ఒకదానికంటె ఒకటి మించిపోయినట్లుగా ఆనందాన్ని అందించారు. ఆ మాత్రము unity మన Institute లో లేకపోయిందా. దీనికి అధికారులు యేమి చేస్తున్నారు? ఎందుకోసము వీళ్లకు అధికారము యిచ్చాము. వీరు చేసే పని యేమిటి? బుర్ అని భజన టైములో రావటం సర్ అని పైకి వెళ్లిపోవటం. ఇదేనా వీరు చేయవలసినటువంటి పని.

పిల్లల యొక్క పరిస్థితి యీ రీతిగా వుంది. వీరిని యే విధముగా ఆదర్శవంతముగా తీర్చిదిద్దాలి యీ Professors కు పిల్లలకు వుండవలసినటువంటి సన్నిహిత సంబంధ బాంధవ్యమేమిటి, మనము వీళ్లను యే రీతిగా తీర్చిదిద్దాలి అనేటువంటి విచారమే వీళ్లలో లేదు. పిల్లలకు Professors పైన విశ్వాసము పోయింది. Professors కు పిల్లలపైన ఒక విధమైనటువంటి నమ్మకము పోతుంది. ఈ విధముగా ఒకరితో ఒకరికి యే విధమైన సంబంధము లేకుండాపోతే యీ Institute యే విధముగా నడచటానికి వీలవుతుంది. ఒక్కొక్కరికి ఒక్కొక్క బాధ్యతనిచ్చి Registrar కు Registrar పని, Professors కు Professors కు ఆ subject నుగురించి వాళ్లకు, Physical Instructors వాళ్లకు సంబంధించినది వాళ్లకు యీ విధముగా కొన్ని కమిటీలంతా నిర్ణయము చేస్తే యెంత హాయిగా జరుగుతుంది. కేవలం ఒక్క ఆటల విషయంలోనే కాదు టీచింగ్ లోపల కూడను చాలా శ్రద్ధను వహించాలి.

ఇప్పుడు వైట్ ఫీల్డ్ గురించి తీసుకుందాం. White field లో Physical director లేడు. పిల్లలు పాపం వారికి వారే అవస్థపడి వారిలో వారే ఒకరికొకరు సరిదిద్దుకొని యీ ఆటలలో పోటీలకు వచ్చారు. ఇలాంటి పోటీలు పెట్టటమంటే మనకు యే విధముగా మనసు వస్తుంది. అందులో కూడను under graduate పిల్లలే white field లో వుండేటువంటిది. ఆ పిల్లలను తెచ్చి Post graduate వాళ్లతో పోటీ పెట్టారు. ఇక్కడ Principal కైనా బుద్ధి లేదా? ఎందుకోసం యింత మాత్రం యోచన చేయలేకుండాపోయారు. ఆ పిల్లలు ఓడిపోతే నాకెంత బాధ వస్తుంది. కేవలము మన ప్రశాంతి నిలయము పిల్లలు గెల్చారు గెల్చారు అనుకోటం యిది కేవలము అవమానం. చిన్నపిల్లలతో పెద్దపిల్లలు గెల్చటమనేటువంటిది చాలా అవమానకరమైనటువంటి విషయము. ఒకానొక సమయములో అర్జునుడు చెప్పాడు. ప్రమీల పిల్చి అర్జునా నీవు నాతో యుద్ధము చేసి నన్ను జయించు. నీవు తరువాత కావలిస్తే వెళ్లు అంది. అర్జునునికి అక్కడ ధర్మసంకటమైంది. ప్రమీలతో గెల్చినా ఆడవాళ్లతో గెల్చటంలో యేమి గొప్ప. ప్రమీలతో ఓడిపోతే ఆడవాళ్లతో ఓడిపోయాడు అనుకుంటారు. ఈ సమయములో నేను ప్రమీలతో యుద్ధము చేయటమా మానటమా అనుకున్నాడు. అనాది కాలమునుండి యీ సమయోధులను యిన్ని విధములుగా విచారణ చేస్తూ వచ్చింది మన భారత దేశము. కనుక యీ విధముగా కూడను పిల్లలయొక్క పరిస్థితిని మనము చక్కగా గుర్తించి వర్తింప చెయ్యాలి.

ఈవిధమైనటువంటి organise అనేటువంటిది యేమాత్రము సక్రమముగా జరగటంలేదు.

మరొక చిన్నవిషయము. కొంతమంది ఆడుతున్నారు పిల్లలు. ఆడేటువంటివారికి చూచేటువంటి వారు అధికముగా వుత్సాహముగావుంటే ఆడే పిల్లలకు మరింత వుత్సాహముగా వుంటుంది. కానీ చూచేటువంటివారే లేరు. మన Institute పిల్లలందరు కూడను మందిరంలో వచ్చి కూర్చుంటారు. ఇంక ఆడేపిల్లలకు యేరీతిగా వుత్సాహము అభివృద్ధి అవుతుంది. పిల్లలు అందరు వుండేతీరాలి అనే నియమము యెందుకు చెప్పకూడదు. ఎంతమంది మన ప్రశాంతినిలయము campus లో వుండేటువంటి పిల్లలు యీయొక్క games లో పాల్గొన్నారు. ఎనభైపైన సంటు పాల్గొనలేదు. దీనిని యెవరు గమనించారు. ఎవరికోసము యీ ఆటలు పెట్టాము ఎందుకోసమో ఆటలు పెట్టాము. ఇది గమనించకుండాపోతే యీ అధికారులయొక్క ప్రయోజనము. ఇలాంటి విషయములో పల చాలా బాధవేస్తుంది.

ప్రపంచములో యెన్ని వేల కాలేజీలో వుంటున్నయి కానీ మన కాలేజీ స్థాపించటంలో వున్నటువంటి అంతరార్థమేమిటి? పవిత్రమైనటువంటి నైతిక ఆదర్శమును నిరూపించాలి. దివ్యమైన భావములో యీయొక్క విద్యార్థులను ప్రవేశపెట్టాలి. ఏకమత్యమనేటువంటి విశాలభావాన్ని పెంచాలి. ఇలాంటి పవిత్రమైన ఆధ్యాత్మిక దృష్టిలో వారిని చేర్చాలి. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక మార్గములందు తాకికన్నికూడను నిరూపించి యీ విధమైనటువంటి ఆదర్శప్రాయులుగా దేశానికి అందించాలనేటువంటి వుద్దేశ్యమే. అలాంటి సమయములో యితర కాలేజీలకు మన కాలేజీలను పోలిక చేయటము యేమాత్రము సరికాదు. మనకు యే పోలికలు వద్దు. మనదాన్ని మనము అనుభవిస్తాము. ఈవిధమైన మార్గాన్ని మనము కించిత్తు యోచించకుండా చేసినప్పుడు సంవత్సరానికి ఒక్కతూరి జరిగేటువంటి వియీ ఆటలు. పూర్వకాలములో కాలేజీలో ఆటలపోటీలంటే అబ్బో యెంత ఆనందమును అనుభవింపచేసేటువంటివారు. ఎంత వుల్లాసమును అనుభవించేటువంటివారు. ఎంత వుల్లాసముగా పనిచేసేటువంటి వారు. కానీ పిల్లలను చూస్తే ఆ ఆనందము వాళ్ళ ముఖాలలో కించిత్తు అయినా కనుపించటంలేదు. ఎవరు వారికి వుత్సాహ ప్రోత్సాహములను అందించేవారు లేరు. ఇలాంటి పరిస్థితిలో పల స్వామికి ఆనందము ఆనందము అంటే యెట్లా వస్తుంది. మొదటినుండి కూడనే ను చెబుతున్నాను నా ప్రాపర్టీ అంతా కూడను పిల్లలేనని. ఆ పిల్లలలో యీ ఆనందము లేకపోతే నాకు యేమి ఆనందము. ఎన్నివిధములుగా ఖర్చుపెట్టి వాళ్ళకు సామానులు తెప్పించాను. ఈవిధమైనటువంటి పరిస్థితిలో పల నిరుత్సాహానికి మూలకారణమెవ్వరు. Professors, Lecturers, అధికారులు వీరే మూలకారణము. అధికారులకు అర్థము లేకపోతే Professors అయినా చెప్పాలి. ఈ Physical Instructors యేవిధముగా పనిచేస్తున్నారు. పిల్లలకు అవసరమైనటువంటివి యేరీతిగా నేర్పుతున్నారు అనేటువంటిది యెవ్వరు దీనిని విచారణ చెయ్యటంలేదు. వాళ్ళు మాత్రం యేమిచేయగలరు. అధికారులేమైనా పిల్చి యిదిచేయి అదిచేయి అంటే వారు పాల్గొనటానికి సంసిద్ధముగా వుంటారు.

ఈ ఆటలయందే కాదు టీచింగ్ యందు కూడను ఒక ప్రత్యేకమైనటువంటి టీచింగ్ ప్రారంభించాలి. ఏదో ఒక subject ని class లో వచ్చి వాళ్ళు లెక్చర్లు కొట్టివెళ్ళిపోతే ప్రయోజనం లేదు. పిల్లలయొక్క వాతావరణానికి యేరీతిగా సరిపోతున్నారు. వాళ్ళకు యే subject లో బలహీనంగా వున్నారు. ఏదొట్లో

వారు నిరుత్సాహ పడుతున్నారు. ఏదో ఇంట్లో అర్థము కాకుండా తపిస్తున్నారు అని వారిని అప్పుడప్పుడు కలసి వారి doubts అంతా క్రమక్రమేణా clear చెయ్యాలి. క్లాసులోనే అప్పుడప్పుడు disputes అని పెట్టాలి. ఇంతేకాకుండా ఆ క్లాసుకు సంబంధించిన టీచర్సులంతా చేరి అక్కడ పైవా అనేటువంటిది వారానికొకతూరి పెట్టాలి. తరువాత వారి నోట్సు ప్రిపరేషన్ యెట్లావుంది యేమిటని వాళ్ళను గమనించాలి. క్విజ్ పోటీలు పెట్టాలి. యింక Home work ఇవ్వాలి. ఇలాంటివన్నీ వాళ్లకు కాలము వ్యర్థము కాకుండా తర్ఫీదు యిస్తూవస్తే పిల్లలు యెంత అభివృద్ధికి రారు. ఈ home assignment అనేటువంటిది యేమాత్రము చేయటంలేదు. యీ assignment యేమాత్రం వాళ్లకు యివ్వటంలేదు. Hostel పిల్లలే College పిల్లలు College పిల్లలే Hostel పిల్లలు. Hostel లో warden కాలేజీలో అధికారులు చక్కగా వుంటుంటే పిల్లలు చెడిపోటానికి వీలులేదు. వాళ్లకు తగిన వుత్సాహప్రోత్సాహాల్ని యెవరు అందించటంలేదు. కనుకనే యీ పిల్లల నిరుత్సాహము దిన దినమునకు దిగజారిపోతున్నది. కొన్ని కొన్ని subjects లో పలవాళ్లకు యేమాత్రము అర్థము కాకుండావుంటే నాకు రాస్తుంటారు బాబు బాపం. నేను చెబుతుంటాను మీ professors కి నువు అడిగి దానికి తగిన సందేహ నివారణ చేసుకోండని. ఈ విధముగా అందరు భక్తులు భక్తులమని వస్తుంటారు. స్వామి మేము మీ కోసమే వచ్చివుండేది. విద్యార్థులు చెబుతారు. ఉపాధ్యాయులు చెబుతారు. ఇది చాలా stunt. నాకోసం యెవ్వరూ రాలేదు. మీకోసం మీరు వచ్చారు. ప్రతి విద్యార్థి I have come for you. I have come for you అని అంటారు. ఈ మాటలు నేర్చితే ప్రయోజనము లేదు.

పాటలు పాడిన ఫలమేమి - మంచిమాటలు నేర్చిన మహిమేమి
సూటిగ సాయిబాటలో నడచిన - సుఖమను మూటలు దొరకును గా
ఇహపరసుఖమను మూటలు దొరకును గా.

మాటలు మాటలు, యీ మాటలలో యీ యొక్క వ్రాతలలో చూస్తే చాలా వున్నతస్థాయిలో కనుపిస్తాడు. కానీ హృదయము యొక్క బాటలో చూస్తే అంతా చీకటే.

కనుక నిజముగా స్వామి కోసము వచ్చినటువంటి వారైతే పిల్లల యొక్క పరిస్థితి, పిల్లల యొక్క ఇక్కట్లు, పిల్లల యొక్క బాధలు వీరెందుకు గమనించకూడదు. ఇంకా యీ Bio Science department ఒకటుండాది. ఇది మరింత worst. ఆ చీకటి గదులో కూర్చొని కప్పలు, చేపలు, పాములు కోస్తూ ఆ కంపులోనే వీరు మునిగిపోతున్నారు. వీరికి సరియైన guidence యిచ్చేటువంటి వారుగాని, యీ వాతావరణమునకు తగినట్లుగా ఆ పిల్లలను మార్చటంగాని వీరు యేమాత్రము ప్రయత్నించటంలేదు. కేవలము వారికి డిగ్రీలు రావాలి. ఉద్యోగము చిక్కాలి. ఈ డిగ్రీనా మనకు కావలసినది. ఈ begging bowl తీసుకొని పోయి ఆఫీసు ఆఫీసుకుపోయి సార్ నాకు ఉద్యోగము ఉద్యోగము యీ beggars గా తయారు చేయటానికి మేము యీ Institute ప్రారంభించలేదు. వాళ్ల స్వశక్తిపైన వాళ్లు ఆధారపడాలి. వాళ్ల కాళ్లపైన వాళ్లు నిల్చాలి. చదువు మాజీవితానికి అని చెప్పి భావించాలిగాని జీవితవృప యోగమునకు అని చెప్పి భావించటానికి కాదు. ఇలాంటి సత్యాన్ని వాళ్లు గుర్తింప చెయ్యాలి. కనుక యీ విద్యార్థులతోనే తెల్లవారి మొదలు సాయంత్రమువరకు వాళ్లతో కలసి మెలసి వుండినప్పుడే వాళ్ల పరిస్థితిని చక్కగా అర్థము చేసుకోటానికి వీలవు

తుంది. ఏ ఒక్క పిల్లలపైన control వుండటం లేదు. ఎవరిపాటున వాళ్లు వుంటున్నారు. ఈ విధముగా వుంటుంటే ఈ Institute యే మాత్రం వుపయోగము లేదు. దీనికి యేదైనా సరియైనటువంటి కొన్ని కట్టుదిట్టములు చేసినప్పుడే యిది సరియైనటువంటి స్థితికి రాగలదు. ఎంతకాలము నుండియో నేను అనుభవిస్తున్నాను. కానీ చెప్పినాను వంటరిగా వంటరిగా పిల్చేసి వంద పర్యాయములు చెప్పినాను కానీ యే మాత్రం మార్పు లేకపోవటం చేతనే యీనాడు బహిరంగముగా చెప్పవలసివచ్చింది. ఎవరిమటుకు వారు మా దోషము లేదని భావిస్తున్నారు కానీ యే దోషము లేకపోతే యీ వాసన యెందుకు వస్తుంది. అరవై మైళ్లు వుంటున్నది అనంతపురము. ఏ అధికారియైనా అక్కడకు camp వేసి వారి పరిస్థితులు యేమిటని విచారించారా. ఏ ఒక్కటి కావలసినా phone ఆడపిల్లలు రావటము వీళ్ల దగ్గర పెంచి పెట్టుకోటం. తిరిగి వారు వచ్చిన దారిన వెళ్లటం. ఇదా మనము చేయవలసినటువంటి అధికారము. మీరు యెందుకు అక్కడకు వెళ్లి స్వయముగా పరిస్థితులు చూచి problems అంతా మీరు యెందుకు పరిహారము చేయకూడదు. మా డ్యూటీలు కాకతూరి వాళ్లు వ్యాసులు చేసుకురావటం యిది న్యాయమా మీకు. కాదు కాదు. మన పాటికి మనము యేదో రూములో కూర్చొని మన పని మనము చేస్తున్నామనుకోటం కాదు. పిల్లల యొక్క పరిస్థితులను క్షణక్షణము కూడను గమనించాలి.

Hostel పరిస్థితి యెట్లా వుందని మీరు కొంతవరకు గమనించాలి. ఏదో రాణీ వాసంలో కూర్చుని రాణి మాదిరి తన రూములో తను కూర్చుని పిల్లలతో మాట్లాడుతూ వుంటే ప్రయోజనము లేదు. ప్రతి రూముకు వెళ్లాలి. ప్రతి పిల్లవాని యొక్క problems గుర్తించాలి. వారు యేవిధమైనటువంటి ప్రవర్తనలో వుంటున్నారు గమనించాలి. తమ తమ కర్తవ్యాలు యెవరు సక్రమముగా నిర్వర్తించటం లేదు. ఈ విధముగా వుంటున్నప్పుడు యీ Institute యొక్క ఆశయములు యే విధముగా మనము అభివృద్ధిగావించగలము. ఆడవారు చేసినటువంటి మేనేజ్‌మెంటు కూడా మగవారు చేయలేకుండా పోతున్నారే. ప్రక్కనే వుంటున్నది హైయర్ స్కూలు. దానిలో physical Instructor అనేటువంటి వారే లేరు. ఈ మగపిల్లలతో, ఆడపిల్లలతో వారు యెంత బాగా పని చేయిస్తున్నారు. దీనికన్నింటికీ మూలకారణము శ్రద్ధ శ్రద్ధ. శ్రద్ధవుంటే యెన్నైనా మనము చేయవచ్చును. శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్. అన్ని జ్ఞానములు మనకు ఆవిర్భవిస్తాయి.

చదువెందులకని సంగతి మీరు అడచి
ఉదరపోషణకై ఉరుకులెత్తుచు
ఎదుటి గొప్ప సహియింపకేడ్చుచు
సతమతమయ్యే చదువుల బొమ్మా.
తైతైతైతైతై బొమ్మా.

ఇలాంటి చదువా మనకు కావలసినది. విశాల భావాన్ని పెంచుకోవాలి. విశాల హృదయములో ప్రవేశించాలి. ఏకమత్యముతో చేయి కలపాలి. ఆదర్శమును లోకానికి చూపాలి. ప్రేమతత్వాన్ని ప్రధానమైన లక్ష్యములో పెట్టుకోవాలి.

ఒక్కొక్క దానికి ఒక్కొక్క కమిటీని నిర్ణయము చెయ్యాలి. ఒక selection కమిటీ దానికి సరియైనటువంటి వారిని పెట్టుకోవాలి. బయట నుండి వచ్చేటువంటి Professors కు మన

professors కు సన్నిహిత సంబంధ బాంధవ్యమును చేర్చాలి. ఏదో వచ్చిన professors వాళ్లు మాటికి వాళ్లు మాట్లాడి పంపిస్తుంటే యీ professors కు ఆ professors కు వుండిన difference మనము understand చేసుకోవాలి. ప్రతి వారము కూడను professors ను మీట్ చెయ్యాలి. వాళ్లతో ఒక కమిటీ పెట్టాలి. వాళ్ల సమస్యలు యేమిటి. పిల్లలకు వాళ్లకు వుండినటువంటి సంబంధము యేరీతిగా వుంది. చెప్పకుండా చేయకుండా ఒక్కొక్క క్లాసులో వెళ్లిపోయి చూడాలి యేవిధముగా చెబుతున్నారో అని. ఏమిటి తక్కువగా వుండాలి యిక్కడ. ప్రారంభమైన నాలుగు సంవత్సరములు అయినప్పటికి నియింత గొప్ప భవనములు కట్టినాము. ప్రతి విషయములో కూడను అనుకూలములు చేశాం. స్కేలు ప్రకారము జీతాలు యిస్తున్నాము. వారికి తగినటువంటి యింక్రిమెంట్లు యిస్తున్నాము. ఏమి తక్కువ చేశాము వాళ్లకు. దానికి తగినట్లుగా వాళ్లు యెందుకు నడుచుకోకూడదు. లేదు. దానికి తగినటువంటి క్రియలు జరపటం లేదు. కనుక నేనేను యెక్కడికి ప్రవేశించాలన్నా యెక్కడికి రావలన్నా నాకు తగినంత ఆనందము నాకు చిక్కటం లేదు. అయితే నేను యెప్పుడూ ఆనందమే. మీనుంచి ఆనందము నాకు రావటం లేదు. మీనుంచి నాకు ఆనందము పోవటం లేదు. అయితే ఒక organisation పెట్టిన తరువాత దాని యొక్క స్థితిగతులు చూడవలసిన బాధ్యత వుంది. కనుక దీనికి కొన్ని విధములైనటువంటి బాధ్యతలు కూడను తీసుకోవలసి వచ్చింది. పిల్లలకు తగినంత వుత్సాహము లేదు. నేను వంటరి వంటరిగా పిలచి అడుగుతున్నాను. Professors ను చూచి అధికారులను చూచి భయపడవచ్చును కానీ స్వామి దగ్గర open గా చెప్పుతూ వుంటారు పాపం. స్వామితో వారికి ఆ అధికారము వుంటూ వుండాది. అందువలననే వారి యొక్క కష్టాలు నష్టాలు స్వామి దగ్గర చెప్పుకుంటారు. మన పిల్లల దగ్గర నుంచి యీ విధమైన complaint రానేకూడదు. ఒక్కనయాపైసా వారి దగ్గర నుండి ఫీజు తీసుకోటం లేదు. మెడికల్ ఫీజు గానీ, గేమ్స్ ఫీజు గానీ లైబ్రరీ ఫీజు గానీ, లేబరేటరీ ఫీజు గానీ Examination Fees గానీ లేదు. ఇలాంటి పరిస్థితులలో వారు పిల్లలు కదా మంచి బిడ్డలను పోషించుకున్నట్లుగా ప్రేమగా పోషిస్తుంటే వాళ్లు యీ విధముగా నిరుత్సాహము యివ్వటము యిది సరియైనటువంటి పని కాదు. ఇంక ముందుకైనా కూడను యిలాంటి అవస్థలు గానీ యిలాంటి complaints గానీ రాకుండా చూచుకోటానికి తగిన కృషి చెయ్యాలి.

పిల్లలంతా వచ్చారు మూడు క్యాంపస్‌ల వారు. కానీ ఆ వచ్చిన వారికి యేమైనా arrangements చేశారా. యేమీ లేదు. అన్ని మందిరంలో కూర్చొని నేను చేశాను. స్కేటింగ్ జరుగుతున్నాది. ఆడపిల్లల దగ్గర అంటే మేము వచ్చి యెక్కడ కూర్చోవాలి. ఏమీ లేదు. కనుక నేనే చిరంజీవి రావుతో చెప్పి ఒక షామియానా తెప్పించి అక్కడ వేయించి నాలుగు కుర్చీలు వేయండి అని చెప్పాను. దీనికి అధికారులు యేమి పని చేస్తున్నారు. నిజంగా యిది పూర్తి అధికారుల దోషం. vice chancellor దీని యొక్క పని నంతా క్రమక్రమేణా తగ్గించుకొని అన్నింటిపైనా కొన్ని విధములైన check up చేసుకుంటూ రావటానికి, ఒక్కొక్కరికి ఒక్కొక్క బాధ్యత యిచ్చివేసి తాను పైగా అన్నింటిని చూసుకుంటూ రావాలి. ఆ పని చేసినప్పుడే యిది బాగుపడుతుంది. అన్నీ తన కంట్రోల్ లో పెట్టుకుంటే యే పని జరగదు. Registrar కు యివ్వవలసినటువంటి పని Registrar కు యివ్వాలి.

కంట్రోలరుకుయివ్వవలసినపని కంట్రోలరకు యివ్వాలి. ట్రెజరరకు యివ్వవలసినపని ట్రెజరరకు యివ్వాలి. డైరక్టరుకు యివ్వవలసిన పని డైరక్టరుకు యివ్వాలి. డైరక్టర్ అక్కడ యేమి చేస్తాడు పాపం. ఏమీలేదు. వుప్పు లేని పప్పు మాదిరి వున్నారు. ఆయన మహాజన్. కనుక యీ విధముగా మున్ముందు ఒక కమిటీని స్థాపించి ఒక్కొక్కదానికి ఒక్కొక్క కమిటీ పెట్టి ఆ కమిటీతో consult చేసి అన్ని విధాలుగా డను కొంచెం explain చేసుకుంటూ రావాలి.

ఇదే విధముగా హాస్టల్లో కూడను కొన్ని యేర్పాట్లు జరగాలి. పిల్లల యొక్క పరిస్థితిని ప్రతిదానికి స్వయముగా వెళ్లి చూచుకుంటూ రావాలి. కాని అక్కడ కూడను యీ శ్రద్ధా భక్తులు యే మాత్రము కనుపించుటలేదు. ఏదో warden లు చెప్పిన దానికి అవును అవును పాము అదుగో అంటే పడగ యెంతరా అని ఒకరు చెప్పే శిష్యులు కూడా వుంటున్నారు అక్కడ. అట్లా చెప్తే ప్రయోజనము లేదు. సార్ యిది mistake యిది సరియైనది కాదు. ఈ విధముగా చెయ్యాలి అని బోధించేటువంటి వారు లేరు. చాలామంది పిల్లలు letters రాసి యిస్తుంటారు. స్వామి మేము మందిరానికి వచ్చి అక్కడ వుంటాము. మాకు హాస్టల్లో సరిలేదు అని రాస్తుంటారు. దినానికి పది పదహైదు letters వస్తుంటాయి. దీనికి explain చేసేందుకు సిద్ధముగా వుంటున్నారు. స్వామి పొద్దున్న సాయంకాలము స్వామిని చూడటంకోసం వాళ్లు యిక్కడకు వస్తామని అంటున్నారని. అది కాదు లోపల కారణము వీరెవరికి తెలియటంలేదు. అక్కడ సరియైనటువంటి management జరగటంలేదు. ఒక చిన్న ఉదాహరణము. NDA Examinations కి ఐదు మంది పిల్లలు పోతున్నారు. వీరు పోతుంటే స్వామికి చెప్పవలసిన అవసరము లేదా? ఇక్కడనుండే ఆర్డరు వేసి పంపించేశారు. స్వామికి వారికి వుండినటువంటి సంబంధ బాంధవ్యాన్ని దూరము చేస్తున్నారు వీళ్లంతా. College లోపల professors permission యిస్తున్నారు. Hostel లో warden వాళ్లను permission యిస్తున్నారు. ఇంక నా దగ్గరకు రానక్కరలేదు. వాళ్ల తల్లితండ్రులు యెంత భక్తితో, యెంత ప్రేమతో, యెంత విశ్వాసముతో స్వామి దగ్గరకు వచ్చి చేరుస్తున్నారు పిల్లలను. ఆ పిల్లలు ఆ మిలట్రీలో చేరటానికి యిష్టమో కాదో మీరు మాత్రం permission యిచ్చి పంపించేస్తే ఆ బాధ్యత మీదా నాదా. పెద్ద పెద్ద MA లు BA లు చదివినటువంటి వాళ్లే ఆ యొక్క దాంట్లో యే మాత్రం అభివృద్ధి లేకుండా పోతున్నారు. ఇంటర్ మీడియట్ లో వున్న చిన్న పిల్లల్ని అక్కడకు పంపిస్తే వాళ్లు యేమి పని చేస్తారు. సిపాయిల మాదిరి పేనుగు లెత్తుతుంటారు. అంతే వారి పని. అలాంటి దానికి యెందుకు పంపించాలి. కనుక Post graduate వరకు అన్నా వారిని చదివించాలి. అప్పుడు తల్లితండ్రులకు సంతోషము మనకూ ఆనందము వస్తుంది. అట్లు కాకుండా చిన్న చిన్న పిల్లలను అందరిని స్వామి పర్మిషన్ లేదు స్వామి దగ్గరకు రానక్కరలేదు స్వామితో చెప్పనక్కరలేదు పర్మిషన్ యివ్వటం పంపించటం. ఎవరిచ్చారు మీకీ అధికారాలు. ఈ విధముగా అస్తవ్యస్తముగా జరిగిపోతుంటే చాలా బాధగా వుంది. ఎవరిది Hostel. మనదికాదా. యింత మాత్రము వీళ్లకు బాధ్యత లేదా. పిల్లలను యే విధముగా పెంచాలి, యే విధముగా చెయ్యాలి అని వాళ్లకు తెలియటం లేదు. తమ బిడ్డలకంటె యెక్కువగా వీళ్లను ప్రేమించాలి. వీళ్ల బాధలను కొంతవరకు గమనించాలి.

ఈవిధమైన టువంటి మార్పులు కూర్పులు చేర్పులు కలిగినప్పుడే యీయొక్క Institute చక్కగా రాణిస్తుంది. కేవలము మీకోసం వచ్చాం, మీకోసం వచ్చాం అని చెప్పినంత మాత్రమున నాకోసం వచ్చినట్లు కాదు. ఈ పిల్లలు కూడ యెంతమంది యీవిధముగా చెప్పారు. స్వామి మీకోసమే వచ్చాం మీరే మాకు కావాలి. మీరే మాకు కావాలి. యెంతవరకు పరీక్షలు ప్యాస య్యేవరకు. డిగ్రీలు తీసుకొనే వరకు. తరువాతికి ఇంక పిచ్చి పడుతుంది. ఏపిచ్చి. పెండ్లి పిచ్చి. ఈ పెండ్లి పిచ్చి పట్టేటప్పటికి తల్లితండ్రుల పైన కుంటి సాకులు చెప్పి కంటికి కనుపించకుండా వెళ్లిపోతుంటారు. మీరు యెక్కడకైనా వెళ్లండి. కానీ మంచిగా వుండండి. మన ఆదర్శములను యేమాత్రము వుల్లఘించకుండా చూచుకోండి. అయితే మంచి పిల్లలు కూడను లేకపోలేదు. ఏదో నాటికో కోటికో ఇంక అదృష్టవంతుడు వుండి స్వామిని వదలిపెట్టలేనటువంటి వారు కూడా వున్నారు. వారు యేవిధమైన భావముతో వున్నారో నేనుకూడను వారిని ఆవిధమైన భావముతోనే వాత్సల్యముగా చూచుతుంటూ వారికెట్టి కొరతలు లేకుండా వారికి తగినటువంటి బాధ్యతనిచ్చి చూచుకుంటున్నాను. యద్భావం తద్భవతి. మీ భావములను బట్టే నా భావము వుంటాది. నేను వట్టి అద్దము వంటి వాడిని. మీరు యేవిధముగా వుంటే ఆవిధమైనటువంటి Reflection, Reaction, Resound మీలో కలుగుతూ వుంటుంది.

కనుక జరిగిపోయింది జరిగిపోయింది. యిక ముందైనా కూడను యిది సంక్రాంతి ప్రారంభమైంది. క్రాంతి అంటే మార్పు. సూర్యుడు దక్షిణము నుండి ఉత్తరానికి బయలుదేరుతున్నాడు. చంద్రమా మనసో జాతః చక్షో సూర్యో అజాయత. యీ మనదృష్టిని వుత్తర దిశకు ఉత్తమమైన మార్గానికి, ఉన్నతమైన మార్గానికి మన మూప్రయాణము చేయించాలి. యికపైన యీ క్రమశిక్షణను, యీ నిబంధనలను సక్రమముగా పాటించి, సరియైన బాధ్యతలను వారికిచ్చి మన టీచర్లకూడా వుత్సాహ ప్రోత్సాహములను పెంచి యీపిల్లలను చక్కని రీతిగా తీర్చిదిద్దటానికి తగిన కృషి చెయ్యాలి. స్వామి యొక్క హృదయము పూర్ణస్వరూపమైనటువంటిది. స్వామిలో యెట్టి స్వార్థము లేదు. అట్టి పూర్ణస్వరూపమును పొందాలంటే మీ క్రియలన్నీ పూర్ణముగా వుంటుండాలి. ఏ విధముగా కూడను అపూర్ణముగా వుంటుంటే యీపూర్ణత్వాన్ని పొందలేరు. ప్రతి విషయములోనూ పంక్చువల్‌గా వుండాలి. అది నాయొక్క సమ్మతి. ఏ చిన్న దాంట్లో కొంచెం లేకపోయినప్పటికి నేను యే మాత్రం అంగీకరించను. కనుక నేను పంక్చువల్‌గా మనయొక్క తత్వమును, మనశక్తిని, మనవిద్యను సరియైన మార్గములో ప్రవేశపెట్టి ఆపిల్లలను ఉన్నతస్థాయికి తెప్పించాలి. ఈవిధమైనదాన్ని తెప్పించటానికి మున్ముందు తగినటువంటి కృషి మనము చెయ్యాలి. ఆవిధముగా చేసినప్పుడే స్వామి దయను, స్వామి ఆనందాన్ని మీరు అందుకొని దేశానికి కూడను పంచటానికి వీలు వుంటుంది. ప్రతివారం ఒక్కొక్క మీటింగు పెట్టుకొని టీచర్లతో అన్నివిధాల కూడను చర్చలు చెయ్యాలి. నేను యెన్నో పర్యాయములు చెప్పాను. తొమ్మిది నెలలకు పూర్వము కూడను ప్రతి 15 దినములకు ఒకొక్క మీటింగు పెట్టుకోవాలని. ఇప్పుడు తొమ్మిది నెలలు అయిపోయింది. యీనాటికి కూడను ఒక మీటింగు లేదు. మనందరి లక్ష్యము పిల్లలను చక్కగా ఉన్నతస్థాయికి తెప్పించి వాళ్ల ద్వారా దేశమును అన్నివిధముల అభివృద్ధికి తేవాలి. అధికారులు, టీచర్లు పిల్లలే స్వామిరూపమే ముగా భావించి ఆపిల్లల యొక్క సేవలలో పలు మీ సంపూర్ణమైనటువంటి శక్తిని వినియోగించండి. అదే స్వామిసేవగా భావించండి. ఏ అనుకూలము

ట కావలసినా నేను చేయటానికి సిద్ధముగా వున్నాను. కనుక యీనాటికి జరిగిపోయింది జరిగిపోయింది. జరగవలసినటువంటి దానికి తగిన ప్రయత్నము చేసి, ఎవరికి యేమేమి బాధ్యత నివ్వాలో ఆయా బాధ్యతలు వారికి ఇచ్చి పనులు చేయించటానికి తగిన కృషి చెయ్యాలని నేను ఆసీస్త్రు ప్రసంగాన్ని విరమిస్తున్నాను.